

# ఈ సమాజం బాగుపడదు

# "మిర్రర్"

''హైదరాబాద్‌లో ఇన్ని బ్రహ్మాండమైన బార్‌లు వుండగా ఈ రూమ్‌లో ఎరేంజి చేసావేమిటి'' అన్నాను

''బార్‌లో అయితే బిల్లు పెరిగిపోతోందన్న భయంతో కిక్కురాదు సరంజామా అంతా ముందే కొనేయటంవల్ల ఇక్కడ ఆ బాధ వుండదు దేర్‌ఫోర్ '' మిగిలిన మాటలు మింగేస్తూ అయిస్ క్యూబ్స్ గ్లాసుల్లో సర్ద సాగాడు రమణమూర్తి

సెక్రటేరియట్‌లో పనివుండి హైదరాబాదు వచ్చి రెండు రోజులు అయింది పని పూర్తి కాలేదు

ఇంకా రెండు రోజులువున్నా పని అయ్యేలా లేదు వుంటే మరింత ఖర్చు ఇప్పటికి ఇంటికి వెళ్ళి మరోసారి హైదరాబాదు వచ్చినా ఇంకా కొంత ఖర్చు అవుతుంది. ఏం చేయాలో తెలియక సెక్రటేరియట్ గార్డెన్‌లో ఓ చెట్టు కింద నిలబడి ఆలోచిస్తుండగా వెనకాలనుంచి వచ్చి వీపు తట్టాడు రమణమూర్తి

దాదాపు అయిదు సంవత్సరాల తరువాత కలిసాడు రమణమూర్తి అప్పట్లో ఇద్దరం ఒకే ఆఫీసులో పని చేసేవారం బెస్ట్ ఫ్రెండ్స్ కాకపోయినా, డియర్ ఫ్రెండ్స్‌గానే వుండేవారం తరువాత ఇద్దరికీ ట్రాన్స్‌ఫర్లు, ఆ పైన ఎవరికివారే అయిపోయాం

టాప్ లెవల్లో తెలిసిన వాడెవడో వుంటె, ఇన్‌ఫ్లూయెన్సు చేసి, క్షణంలో నా పని పూర్తి చేయించాడు రమణమూర్తి

తిరుగు ప్రయాణం అవుదామనుకుంటె —

''నా ఆతిథ్యం తీసుకోకుండానే వెళ్ళి పోతావా సాయంత్రం ఏడింటికి ఇంటికిరా'' అంటూ అడ్రసు ఇచ్చి, తనకి వేరే పనివుందంటూ బిజీగా వెళ్ళిపోయాడు

అడ్రసు వెతుక్కుంటూ వచ్చి ఇక్కడ తేలాను ఇది ఇల్లు అనేకంటె రూము అంటె బాగుంటుంది

నాలుగు కుర్చీలు, మధ్యలో టీపాయి అలమరాలో గ్లాసులు, కప్పులు, ఓ ఫ్లాస్కు కార్నర్‌లో మంచి నీళ్ళ కూజా చుట్టూ గోడలకి రెండు మూడు కాలెండర్లు

రమణమూర్తికి పెళ్ళి అయిందని విన్నాను

మరి పెళ్ళాం పిల్లలు ఏరి ?

అడగటం ఎందుకు ? తనే చెబుతాడులే అనుకుంటూ నా మనసులోఆరాటాన్ని కంట్రోలు చేసుకున్నాను

రమణమూర్తి గ్లాసులో మందు సర్దటం ముగించి నా ముందు ఒక గ్లాసు వుంచుతూ, ''నవ్ లెటజ్ స్టార్ట్'' అన్నాడు

''ఆ రోజుల్లో నీ అంత మంచి బాలుడు లేడన్నట్టుగా వుండేవాడివి ఈ మందు ఎప్పుడు అలవాటు అయింది'' అన్నాను గ్లాసు చేతిలోకి తీసుకుంటూ

నా ప్రశ్న వినిపించుకోకుండా —

''ఫర్ ది బెస్ట్ హెల్త్ ఆఫ్ సుమిత్ర'' అంటూ ఓ పెద్ద గుటకతో ప్రారంభించాడు

''సుమిత్ర ఎవరు ?'' అన్నాను నేను

''యు విల్ కం టు నో'' అంటూ దీక్షగా గ్లాసు కాళీ చేయసాగాడు రమణమూర్తి

రమణమూర్తి ఇంత హెవీగా పుచ్చుకుంటాడని అంచనా వెయ్యలేకపోయాను కాజువల్‌గా, ఎంజాయిమెంట్ కోసం అన్నట్టు కాక, ఏదో బాధను మరిచిపోవటం కోసం తాగుతున్నట్టుగా వుంది

''రమణమూర్తి ! ఐ హోప్ యు నో యువర్ కెపాసిటీ'' అన్నాను అతను మళ్ళీ తన గ్లాసు ద్రవంతో నింపుతుంటే

''డోన్ట్ వర్రీ'' అంటూ చిప్సు నమల సాగాడు.

ఒక నవ వనితా పక్ష
పత్రికలో మీరే కాదు
ఎవరయినా చదవగలిగింది
ఏముంటుంది?

వినోదానికీ
కాలక్షేపానికీ కావలసినవే
కాకుండా అతిముఖ్య
మయిన విషయాలని
గురించి లోతుగా
ఆలోచింపచేసే
రచనలూ ఉంటాయి!

పోటీలు కూడా ఉంటాయి!

ప్రతీ పాఠకురాలినీ
ఒక రచయిత్రిగా మార్చ
గలిగే శీర్షికలూ ఉంటాయి!



కలువబాల

Kasi

# ఈ సమాజం బాగుపడదు

రమణమూర్తి మైకంలో పడిపోతే, అతని భార్య పిల్లలు గురించి తెలుసుకునే అవకాశం వుండదు అతను తెలివిలో వుండగానే అడగాలి అనుకుంటూ —

''మీ ఇల్లు ఎక్కడ ?'' అన్నాను

''మలక్‌పేటలో టి వి టవర్ ఎదురుగా వున్న సందులో ఓ చిన్న ఇల్లు కట్టించాను ఆ మధ్య ''

''మరి ఈ రూము ?''

''ఇక్కడ సుమిత్ర వుంటూ వుండేది ''

''సుమిత్ర అంటే — లౌ ఎఫైరా !''

''కాదు ''

''మరి ''

''అదో కథ వినే ఓపిక వుందా ?''

''ష్యూర్ కేరీ ఆన్'' అన్నాను, మందు గొంతు దిగుతూంటే హుషారు పైకి తన్ను తూంది

''సుమిత్ర తండ్రికి ముగ్గురు ఆడపిల్లలు ఈమె ఆఖరుది వాళ్ల స్వంత వూరులోనే చదివి ఇంటరు పాస్ అయింది ''

''ఏ వూరు ?''

''రామాపురం తెనాలి దగ్గర '

''ఆ వూరు నువ్వెందుకు వెళ్ళావు ?''

''రామాపురం మా అత్తవారి వూరు ఒకసారి — అంటే మూడేళ్ళ కిందట కమలను పుట్టింటిలో దిగవిడవటం కోసం రామాపురం వెళ్ళాను అప్పుడు ఆమెకు ఎనిమిదవ నెల ప్రెగ్నెన్సీ ''

'వూ — ''

''వెంటనే తిరుగు ప్రయాణం లవుదా మనుకుంటే పండగదాకా వుండమని బలవంతం చేసారు అప్పటికి పండగ ఇంకా మూడురోజులు వుంది ''

''అయితే ''

''పండగ ముందు నేనున్న ఆ మూడు రోజులలో సుమిత్రతో పరిచయం అయింది '

''ఎలా''

''ఆ రోజు చిక్కుడు పందిరి కింద విశ్రాంతిగా పడుకుని ఏదో మాగజైన్ తిరగే స్తున్నాను ఇంతలో ఓ కాయితం వుండ వచ్చి నామీద పడింది ''

''ఊఁ''

''ప్రహరీగోడ అవతలివైపు నించి ఓ అందమైన ఆడపిల్ల నావైపు చూస్తోంది ఆ కాగితం విసిరింది ఆమేనని తెలుస్తోంది పెళ్ళి అయిన నాకు ప్రేమలేఖ వ్రాసి ప్రయోజనం ఏమిటి ?'' అనుకుంటూ ఆ కాగితం వుండని విప్పి చూసాను

''ఏముంది అందులో ?''

''దయచేసి నన్ను రక్షించండి— అన్న ఒక్క ముక్క వ్రాసి వుంది ''

## త్రి సత్యాలు

కూలిన గోడల మీద
జిల్లేళ్ళు మొలుస్తాయి,
జారిన బతుకుల మీద
అపవాదులు నిలుస్తాయి !

*

బతికి చెడ్డవాడికి మిగిలింది
పూర్వ ఘనత నెమరువేత,
మత్తు దిగిన మధుపాయికి
వర్తమానం గుండెకోత !!

*

ప్రభుత్వాలు మారేక లభించేవి
సౌకర్యాలుకాదు, సంస్కరణలు !
అవి అమలు జరిగే లోగా
మారుతుంది మళ్లీ—ప్రభుత్వం!!

— లతిక

'' ''

''పల్లెటూళ్ళల్లో కొత్త అల్లుళ్లను వరస అయిన వారు తమాషా కోసం ఆటపట్టిస్తారు ఈ అమ్మాయి నన్ను ఫూల్ చేస్తోందేమోనను కున్నాను కానీ ఆమె కళ్లల్లో ఏదో దైన్యం, నిస్సహాయతతో కూడిన బాధ లాంటిది అగు పించింది ''

''ఊఁ''

'ఏమిటి— అన్నట్టు చూసాను కానీ ఆమె ఏమీ చెప్పకుండానే గోడకి అటువైపున అదృశ్యం అయిపోయింది ''

''తరువాత''

''తరువాత ఎవరూ లేనప్పుడు నేను చూసేట్టుగా గోడమీద ఓ కాగితం పెట్టి వుంచి ఓ రాయి బరువు పెట్టింది ''

''ఆ కాగితంలో ఈసారి ఏం వ్రాసింది?''

''తన కష్టాలు అన్నీ ఏకరువు పెట్టింది ''

''అంత అందమైన అమ్మాయికి కష్టాలు ఏముంటాయి ''

''ఆమె తండ్రికి ముగ్గురు ఆడపిల్లలు అన్నాను కదా ఈమె ఆఖరుది ఈమె తరువాత ఇద్దరు మగ పిల్లలు ''

'' ''

''అప్పటికి ఈమె వయసు ఇరవై ఏళ్ళు అంటె నా భార్య, సుమిత్ర ఇద్దరూ ఒకే ఈడువాళ్ళు ''

నేను వింటున్నట్టుగా తలవూపాను

''సుమిత్ర అక్కయ్యలలో ఎవరికీ పెళ్ళిళ్ళు కాలేదు కాలేదు అనేకంటె, ఆమె తండ్రి ఆర్థిక ఇబ్బందులవల్ల పెళ్ళిళ్ళు చేయలేక పోయాడు సాధారణమైన కుటుంబం తక్కువ

ఆదాయం కట్నాలు ఇచ్చి పెళ్ళి చేయగల స్తోమతు లేదు చూస్తూవుండగానే పెద్ద అమ్మాయికి ఇరవై ఆరు ఏళ్ళు వచ్చేసాయి వయసు ముదురుతున్నకొలదీ సంబంధాలు ఎక్కిరావటంలేదు దాంతో తండ్రికి దిగులు ఇంతలో ఆమె తల్లి మరణించింది ''

'' ''

''ఊళ్ళో అందరూ మీ పిల్లల పెళ్ళి ఎప్పుడు చేస్తారని అడుగుతుంటె, ఆ తండ్రికి పదిమందిలో అవమానంగా వుండేది అయినా చేయగలిగింది ఏమీ లేదు ఒకప్పుడు డబ్బుంటే పెళ్ళిళ్ళు కుదిరిపోయేవే కానీ — ఇప్పుడు ఆ ఆడపిల్లలు ఇంత ఎదిగిపోయేసరికి అసలు సంబంధాలే రావటంలేదు ఇట్టి స్థితిలో దిక్కుతోచక ఆయన మెదలకుండా వుండి పోయాడు

తల్లి పోయిన కారణంగా సుమిత్ర పెద్ద అక్కయ్య వంట ఇంటికే అంకితం అయిపోయింది మిగిలిన ఇద్దరు ఆడపిల్లలు మిగతా ఇంటి పనులు పంచుకున్నారు

రోజులు గడుస్తుంటె వాళ్ళ తండ్రికి పిల్లల పెళ్ళి కాలేదనే దిగులు, బయట పదిమందిలో మరింత తేలిక మాటలు అధికం అయ్యాయి ఆ బాధలో —

ఆడపిల్లలను బయటకు ఎక్కడికీ వెళ్ళవద్దని కట్టడి చేసాడు ఆఖరుకు ఊళ్ళో శ్రీరామ నవమి ఉత్సవం జరిగినా, తెలిసినవారింటిలో శుభకార్యం జరిగినా కూడా ఇల్లు కదలనిచ్చేవాడు కాదు

ఇంటి పని చేయటం, తినటం, నిద్ర పోవటం ఎంతసేపూ ఇదే జీవితం ఆ ఇల్లు ప్రాక్టికల్‌గా జైలులాగా తయారు అయింది ఆ ఆడపిల్లలకు

జైలులో అయినా ఏదైనా ఎంటర్‌టెయిన్‌మెంట్ వుంటుంది కానీ, ఇక్కడ అదీలేదు కనీసం ఓ సినిమా, ఓ వారపత్రిక, ఓ బంధువుల ఇంటికి వెళ్ళటం, అలాంటివి ఏమీ లేక ఆ నాలుగు గోడలమధ్య తాము యావజ్జీవన కారాగారవాసం అనుభవిస్తున్నట్టు, ఎవరో తమ గొంతు బలవంతాన పిసుకుతున్నట్టు, ఊబిలోకి తోసి పైకి రాకుండా కాలుతో నొక్కుతున్నట్టు ఫీల్ కాసాగారు మిగిలిన ఇద్దరి మాట ఎలా వున్నా సుమిత్ర మాత్రం ఆ ఇంటి పరిస్థితులతో ఎడ్జస్టు కాలేకపోయింది ''

రమణమూర్తి కొంచెంసేపు మవునంగా వుండిపోయాడు

కథ మరీ విషాదంగా తయారు అవుతుంటె నాకు నోటిమాట రాకుండా వుండి పోయింది

''తన కంటె తక్కువ చదువుకుని, తన కంటె అందంగా కూడా లేని అనేక మందికి తను చూస్తూవుండగానే పెళ్ళిళ్ళు జరిగి అత్తవారింటికి వెళ్ళిపోతుంటె, తన జీవితంలో ఇలాంటి శుభ దినం అసలు వస్తుందా అన్న అనుమానం కలగేది సుమిత్రకి తమ అక్కయ్యలు ఇద్దరికీ పెళ్ళి అయింతరువాతనే కదా తన పెళ్ళి ప్రసక్తి వాళ్ళకి ఆయి తన వంతు రావాలంటె ఇంకెంత కాలం ఎదురు చూడాలి ? ఈ పరిస్థితులలో తనకి పెళ్ళి అవుతుందని నమ్మకంలేదు అలాంటప్పుడు ఇక జీవితాంతం ఈ నాలుగు గోడలమధ్య వుండి పోవలసిందేనా అన్న ప్రశ్న వుదయించింది

తను చదువుకుంది తెలివితేటలున్నాయి ఆరోగ్యంగా, అందంగా వుంది కేవలం పెళ్ళి కాలేదు పెళ్ళికానంత మాత్రాన, జీవితంలో మరో అనుభూతి, ఆప్యాయత, ఆనందం, మార్పు లేకుండా ఎందుకు పోవాలి ? అసలు తనని బయటకు కదలకుండా చేసి నిత్యం మరణానికి గురిచేస్తున్న ఈ సమాజం, సమాజం యొక్క కట్టుబాట్లు పై అసహ్యం కలిగింది సుమిత్రకి

ఇలా ఇక్కడ ఈ మారుమూల గ్రామంలో నాలుగు గోడల మధ్య మగ్గిపోయేకంటే, బయటి ప్రపంచంలోకి వెళ్ళి స్వయంగా ఏదైనా పని చేసుకుని బ్రతకాలన్న కోరిక బలీయం కాసాగింది

బయటకు పోయే మార్గం లేదు మార్గం వున్నా ఎక్కడికి వెళ్ళాలి? ఎవరు సహాయం చేస్తారు ? ఎవరి సహాయం లేకుండా ఆడపిల్లగా తను ఏం చేయగలనన్న అధైర్యం

ఇంతటి ఆరాటం, ఆతృత, మానసిక సంఘర్షణలో కొట్టుకుంటూండగా, జీవితంలో ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదన్న నిర్ణయానికి వచ్చింది సుమిత్ర

సరిగ్గా అలాంటి సమయంలో కమలను తీసుకుని నేను ఆ వూరు వెళ్ళాను

కమల, సుమిత్ర ఇరుగు పొరుగు కావటంలో ఇద్దరూ బాల్య స్నేహితులు

మాటల సందర్భంలో నా వుద్యోగం, నా చదువు, అర్హత, నా పలుకుబడి, నా మంచిదనం గురించి వున్నవీ లేనివీ గొప్పకోసం సుమిత్ర ముందు చెప్పింది కమల

అవన్నీవిని తనని ఈ ఊబినుంచి బయటకు తీసుకు రాగలిగే వ్యక్తి నేను తప్ప తనకు మరొకరు లేరు అన్న నిర్ణయానికి వచ్చింది సుమిత్ర


తన బాధ అంతా విన్న తరువాత నేను తనకి సహాయం చేయకుండా వుండలేనని నమ్మింది ఒకవేళ నేను కాదంటె అప్పుడే ఆత్మహత్య చేసుకోవచ్చు అనుకుందిట ''

''నీ నుంచి ఎలాంటి సహాయం కోరింది'' అన్నాను చాలా సేపటి తరువాత నోరు విప్పి

''పండగ మరునాడు నేను తిరిగి హైదరాబాదుకు వెళుతున్నట్లు కమల ద్వారా సుమిత్రకి తెలిసింది

తనని ఎలాగైనా నాతోపాటు హైదరాబాద్ తీసుకువెళ్ళి అక్కడ ఏ అనాథశరణాలయంలోనో, స్త్రీ సంక్షేమ గృహంలోనో చేర్పిస్తె, తను చదువుకుంది కాబట్టి ఏదో వుద్యోగం సంపాదించుకుని తన తండ్రికి ఆర్థికంగా సహాయపడటమే కాక, తన జీవితానికి ఓ సార్థకత ఏర్పరచుకోవాలని వుందని వ్రాసింది తాను పుట్టిన తరువాత తాలూకా పొలిమేరలు కూడా దాటి ఎక్కడికీ వెళ్ళలేదు చేతిలో డబ్బు లేకుండా తానెరగని బయటి ప్రపంచంలో ఒంటరి ప్రయాణం తనకసాధ్యం అంది ఇంత విని కూడా నాకు తనపై జాలికలగకపోతే, మరుక్షణం పెరటిలోగల బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని — అంది ''

''నువ్వు ఏం చేసావు ?'' అన్నాను నేను



''ఎవరు ఎలాపోతే నాకెందుకులే అని వూరుకోలేకపోయాను ఆమెను హైదరాబాదు తీసుకువెళ్ళి ఏ హాస్టలులోనైనా చేర్పించటం అసాధ్యం కాదనిపించింది ''

''తరువాత''

''తరువాత ఇద్దరం విడిగా విజయవాడ చేరుకున్నాము విజయవాడ నుంచి రాత్రి బస్సులో బయలుదేరి హైదరాబాదు చేరుకున్నాము కమల పుట్టింటిలో వుంది కాబట్టి మా ఇల్లు ఖాళీగా వుంది అందువల్ల తిన్నగా బస్ డిపో నుంచి సుమిత్రను తీసుకుని మా ఇంటికి వచ్చాను అయితే హాస్టలులో చేర్పించటం నేను వూహించినంత సులభం కాదని గ్రహించాను ఈలోగా ఓ వారం రోజులు గడిచాయి ''

''తరువాత ఏం జరిగింది ''

''ఈ వారం రోజులలో జరగకూడని భయంకరమైన, విషాద సంఘటనలు జరిగాయి ''

''అంటే !''

''ఆ రోజు రాత్రి సుమిత్ర కనపడక పోవడం, అదే రోజు నేను హైదరాబాదు బయలుదేరటం వల్ల, ఫలనా వారి అల్లుడు సుమిత్రను లేవదీసుకుపోయాడని పుకారు పుట్టింది '

''ఎలా కలిగిందో అనుమానం ''

''అంతకు ముందు సుమిత్ర గోడమీద నుంచి నాకు కాగితాలు అందించటం ఇరుగు పొరుగువారు చూసివుంటారు అది కేవలం పుకారేనా లేక నిజమో తెలుసుకోవటానికి మా బావమరిది ఓ రోజున హైదరాబాదు వచ్చాడు అప్పుడు సుమిత్ర, నేను మా ఇంటిలో ముందు రూములో కూర్చునివున్నాము మమ్మల్లను చూసిన అతను, నాతో మాట్లాడకుండానే, నేను చెప్పేది వినకుండానే వెనుతిరిగి వెళ్ళి

# ఈ సమాజం బాగుపడదు

పోయాడు వెళ్ళి రామాపురంలో అది పుకారు కాదని, నిజమని నిర్ధారించాడు

దాంతో కూతురు లేచిపోయిందనే అవమానంతో సుమిత్ర తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు ''

''అయ్యో !'' అంటూ కొయ్యబారిపోయాను నేను

''ఇలాంటి ఘోరం జరుగుతుందని అప్పుడు వూహించలేకపోయాను ప్రవాహంలో మునిగి పోతున్నవాడికి చేయూతనిస్తూ, తోటి మానవుడిగా ఆ మాత్రం సహాయపడటం నా కర్తవ్యం అని భావించాను కానీ ఇంత దూరం ఆలోచించలేకపోయాను'' అన్నాడు రమణమూర్తి

''తరువాత ''

''అయిందేదో అయిందనీ సుమిత్రకి ధైర్యం చెప్పాను ఎలాగో తంటాలువడి ఓ ప్రైవేటు ఫరంలో ఉద్యోగం వేయించాను తరువాత సుమిత్రను మా ఇంటినుంచి తీసుకు వచ్చి ఆమె బస ఈ రూములో ఏర్పాటు చేసాను ''

''ఇప్పుడెక్కడ వుంటూంది ?''

''కొన్నాళ్ళకి సుమిత్రకి సెక్రటేరియెట్‌లో జాబ్ వచ్చింది ఆ తరువాత ఆమె ఈ రూము ఖాళీచేసి వర్కింగ్ వుమెన్సు హాస్టల్‌లోకి మారింది ఆమె ఖాళీచేసినా ఈ రూము నా కింద వుంచుకున్నాను అప్పుడప్పుడు ఇలా వుపయోగపడుతూంది ''

''మరి సుమిత్ర అక్కయ్యలకెవరికైనా పెళ్ళి అయిందా ?''

''తెలియదు ఆ తరువాత నేనుగానీ, సుమిత్రగానీ ఆ వూరు వెళ్ళే ధైర్యం చెయ్యలేక పోయాం సుమిత్రవాళ్ళ అక్కయ్య పేరున డబ్బు పంపితే తీసుకోకుండా తిప్పి పంపిందట ''

''మరి నీకు ఈ మందు ఎప్పుడు అలవాటు అయింది ''

''కమల మరణించిన తరువాత ''

''వ్వాట్ ! నీ భార్య చనిపోయిందా ! ఎలా ?''

''నేను సుమిత్రను లేవతీసుకుపోయానని అందరితోపాటు కమల కూడా నమ్మింది దానికి వాళ్ళ అన్నయ్య మమ్మల్లను చూసి నిర్ధారించటం తోడూ అయింది పెళ్ళి అయిన ఏడాది తిరక్కుండానే తన జీవితం నాశనం అయిపోయిందన్న దిగులుతో నెలలు నిండకముందే డెలివరీ వచ్చి చనిపోయింది మా మామగారు తప్పదు కాబట్టి నాకు తెలియపరిచాడు ఓ కార్డుముక్క ద్వారా ''

''నీ జీవితంలో ఇంతటి కష్టానికి కారణం అయిన సుమిత్రమీద నీకు కోపం లేదా ''

''లేదు పైగా, ఆమెను ఏదో వుద్ధరించాలని ఆమె జీవితంలోకి నేను ప్రవేశించి, ఆమె తండ్రి మరణానికి కారణం అయి, తరువాత సమాజంలో ఆమెకు చెడ్డపేరు కూడా తెచ్చిపెట్టినందుకు నాపై నాకు అసహ్యం కలుగుతూంది ఇంకా చెప్పాలంటె, నిజానిజాలు తెలుసుకోకుండా ఘోరమైన పరిణామాలకు దారితీసే పుకారు లేవదీసిన వారిపై కసిగా వుంది పెళ్ళి కానంత మాత్రాన ఇల్లు కదలకుండా ఆడపిల్ల పడివుండాలనే సాంఘిక నియమాలపై అసహ్యంగా వుంది ఒక స్త్రీ ఒక పురుషుడు కలిసివున్నంత మాత్రాన వాళ్ళిద్దరిమధ్య 'అది' తప్ప మరో సంబంధం లేదనే సమాజాన్ని బాగుచెయ్యాలని వుంది'' అన్నాడు రమణమూర్తి ఆవేశంగా

''కానీ ఈ సమాజం బాగుపడదు'' అన్నాను నేను ఆఖరు పెగ్గు గొంతులో పోసుకుంటూ ★

